అవును... నిజంగా నేను అదృష్టవంతుడినే

● శెట్టిబలిజ కార్తీక వన సమారాధనలో మంత్రి సుభాష్... 7లో

ముద్ద బంతి పూవులో...

లంక గ్రామాల్లో పరిమళిస్తున్న సాగు



బడుగువానిలంకలో సాగు చేస్తున్న ఎరుపు, పసుపు రంగుల బంతి పూల తోటలు



ఆలమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ ప్రాంతంలోని లంక భూముల్లో పలు రకాల పంటలతో పాటు పరిమళించే పూల తోటలు సాగు అధికంగా జరుగుతోంది. గోదావరి వరదల అనంతరం సాగుకు సిద్ధమైన రైతులకు ప్రస్తుతం బంతి సాగు అందుబాటులోకి వచ్చింది. ఆలమూరు మండలం బడుగువానిలంకలో వందలాది ఎకరాల్లో బంతి సాగు చేస్తున్నారు. రైతులు వాటిని కోసి ఇక్కడికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో వున్న కడియపులంక పూల మార్కెట్‌కు ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్లి నేరుగా విక్రయిస్తున్నారు. కార్తీక మాసం సీజను కావడంతో అలంకరణకు బంతి పూలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ.50 ఉంది. ఇటీవలి కాలంలో దూర ప్రాంతాల నుంచి బంతి పూలు తక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లంకల్లో పండించిన బంతికి మంచి ధర లభిస్తోందని రైతులు చెప్తున్నారు.



గ్యారేజీలో బస్సుల నాణ్యతను తెలుసు కుంటున్న డిపో మేనేజర్ మూర్తి

ప్రతినెలా మొదటి వారం డ్రైవర్ల సంతోషకర వారోత్సవం

యాంత్రిక లోపాలు లేని నాణ్యమైన బస్సులతో ప్రయాణికులకు మెరుగైన సేవలు..

ఆదాయం పెంపునకు ప్రత్యేక చర్యలు

అమలాపురం డిపో మేనేజరు సత్యనారాయణమూర్తి



అమలాపురం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యాంత్రిక లోపాలు లేని నాణ్యమైన బస్సులతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆర్టీసీ ఆదాయం పెంచే లక్ష్యంతో యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోదని ఆర్టీసీ అమలాపురం డిపో మేనేజరు చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. ప్రయాణికులను సకాలంలో సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు లోపాలు లేని బస్సులు అవసరమని గుర్తించి.. ప్రధానంగా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంపై దృష్టి సారించామన్నారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అమలాపురం డిపోలో ప్రతినెలా వారం పాటు డ్రైవర్ల సంతోషకర వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిపోలో ఉన్న అన్ని బస్సులు సర్వీసులు పూర్తయి గ్యారేజీలో ఇన్‌కమింగ్ అయిన తర్వాత డ్రైవర్లతో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కమిటీ సభ్యులు, డిపో మేనేజర్ మాట్లాడతారన్నారు. బస్సులకు ఉన్న లోపాలను అడిగి తెలుసుకుని నేరుగా డ్రైవర్ హ్యాపీనెస్ వీక్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారన్నారు. బస్సుల లోపాలను గ్యారేజీలో మెకానిక్స్, ఎలక్ట్రీషియన్లు, కోచ్, బిల్డర్లతో ఎప్పటికప్పుడు సరి చేయిస్తామని చెప్పారు.

అమలాపురం డిపోలో అమరావతి నైట్‌రైడర్, ఇంద్ర, సూపర్ లగ్జరీ, పల్లె వెలుగు, అల్ట్రా డీలక్స్ కలిపి మొత్తం 145 బస్సులు ఉన్నాయి. ఆయా బస్సుల సర్వీసుల నిమిత్తం ప్రతిరోజు 300 మంది డ్రైవర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. గ్యారేజీ సిబ్బందికి డ్రైవరే ప్రధాన వినియోగదారుడు అనే నినాదంతో సంతోషకర వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.



ఆన్‌రోడ్ టెస్ట్ నిర్వహిస్తున్నాం

చల్లా సత్యనారాయణమూర్తి, డిపో మేనేజర్, అమలాపురం

బస్సుల లోపాలను ఎప్పటికప్పుడు సరిచేయడంతో పాటు వాటిని నోటీసు బోర్డులో ప్రకటించే విధంగా చర్యలు తీసుకున్నాం. బస్సుల నాణ్యతను పరిశీలించేందుకు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షణలో గ్యారేజ్ సూపర్‌వైజర్లు, మెయింటెనెన్స్ సిబ్బందితో ఆన్‌రోడ్డు టెస్ట్ నిర్వహిస్తున్నాం. బస్సులు 20 కిలోమీటర్ల మేర వెళ్లి తిరిగొచ్చాక కండిషన్ పూర్తిగా నిర్ధారించిన తర్వాతే సర్వీసుకు ఇస్తున్నాం.

భక్తులతో కిటకిటలాడిన అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం... 7లో



ధాన్యం విక్రయించిన రోజే

చెల్లింపులు

కూటమి ప్రభుత్వ విధానంతో అన్నదాతల్లో ఆనందం

మిల్లర్ల మధ్య పోటీ

మద్దతు ధర కంటే ఎక్కువ పొందుతున్న రైతు

ఆంక్షలు లేవంటూనే అధికారుల కొర్రీలు

నష్టపోతున్న రైతులు

కె.గంగవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యాన్ని విక్రయించిన రోజునే చెల్లింపులు జరుగుతున్నాయి. గతంలో మద్దతు ధర కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు 21 రోజులకు చెల్లింపులు చేసే విధంగా ధాన్యం కొనుగోలు విధానాలు రూపొందించారు. కానీ నెల, రెండు, మూడు నెలలకు ధాన్యం సొమ్ములు రైతు ఖాతాలకు జమ అయ్యేవి కావు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గత రబీ పంటలో సుమారు రూ.1,800 కోట్ల వరకు రైతులకు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని చెల్లించారు. రైతులకు మేలు చేసే విధంగా ధాన్యం కొనుగోలు విధానాన్ని కూటమి ప్రభుత్వం రూపొందించింది. పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా జిల్లాలో ఎక్కడైనా, తమకు నచ్చిన మిల్లుకు విక్రయించుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ప్రస్తుతం అలా జరగట్లేదు. తమ మండలంలోని మిల్లులకు మాత్రమే ధాన్యం విక్రయించుకునే అవకాశం మాత్రమే కల్పించారు. ఎక్కువ ధర చెల్లించడానికి ముందుకు వచ్చిన మిల్లులకు ధాన్యం పంపించుకునే అవకాశం లేకుండా పోతోంది. దీంతో రైతులు అధిక ధర పొందే అవకాశాన్ని కోల్పోతున్నారు.

మిల్లర్ల మధ్య పోటీ - మద్దతు ధరకు మించి కొంటున్న వైనం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఖరీఫ్ సీజన్లో పండిన పంటకు మంచి గిరాకీ వచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మంచి కొనుగోలు చేయడానికి మిల్లర్లు పోటీ పడుతున్నారు. దిగుబడులు తగ్గడం వలన, ధాన్యం నాణ్యంగా ఉండడంతో ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు పోటీ పడుతున్నారు. ప్రభుత మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తా రూ.1,725 ఉంది. దీనిలో హమాలీ, ట్రాన్స్‌పోర్టు రైతు భరిస్తే ప్రభుత్వం తర్వాత కొద్దిమొత్తంలో వారి ఖాతాలకు జమ చేస్తోంది. మిల్లర్లు బహిరంగ మార్కెట్‌లో 75 కిలోల బస్తాకు రూ.1,650 నుంచి రూ.1,700 వరకు రైతుకు నేరుగా చెల్లిస్తూ మధ్యవర్తుల ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

ఇదిలా ఉంటే సీఎంఆర్ విధానంలో ఈ సంవత్సరం రైతుకు మిల్లు ఎంపిక చేసుకునే అవకాశం ఉండటంతో ఆర్ఎస్‌కే ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యానికి తమ మిల్లుకు పంపితే మరో రూ.50 నుంచి రూ.75 బస్తా ఒక్కింటికి చెల్లించడానికి మిల్లర్లు మందుకు వస్తున్నారు. ఈ లెక్కన కొన్నిచోట్ల మద్దతు ధర పూర్తిగా అంటే రూ.1725 వరకు రైతుకు చేరుతుంది. కానీ ఇప్పుడు మండల పరిధిలోని మిల్లులను మాత్రమే ఎంచుకునే అవకాశం ఉంది. దీంతో అదనంగా చెల్లించే మిల్లులకు ధాన్యం పంపుకునే అవకాశం రైతులకు లేకుండా పోయింది.

రైతు పండించిన పంటను విక్రయించుకోవడానికి ఆర్ఎస్‌కేకు వెళితే వారి సొంత మండలంలో మాత్రమే విక్రయించుకునే విధంగా వ్యవస్థ ఉంది. అలా కాకుండా రైతు ఎంపిక చేసుకున్న మిల్లులకు పంపించాలంటే ముందుగా అధికారులకు దరఖాస్తు చేసుకుంటే, వారు ఆ మిల్లును ఆ ఆర్ఎస్‌కేకు అనుసంధానం చేస్తారు. దీనికి పెద్ద ప్రొసెస్ ఉంది. ముందుగా రైతు మండల వ్యవసాయ శాఖ అధికారికి దరఖాస్తు చేయాలి.... ఆయన దానిని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు రికమెండ్ చేయాలి. అప్పుడు వారు రైతు కోరిన మిల్లును వారి ఆర్ఎస్‌కేకు అనుసంధానం చేస్తారు. ఇది జరగడానికి సుమారు మూడు రోజులైనా పట్టువచ్చును. ముఖ్యంగా ఇది మండల వ్యవసాయ శాఖ అధికారులకు తలనొప్పి వ్యవహారం.

ఎలాగంటే.... ఉదాహరణకు కె.గంగవరం మండలంలో 22 ఆర్ఎస్‌కేలు ఉన్నాయి. ప్రతి ఆర్ఎస్‌కే నుంచి రోజూ పది మంది రైతులు నాకు ఈ మిల్లు కావాలి అని దరఖాస్తు చేస్తే రోజుకు 220 దరఖాస్తులను ఆయన రికమండ్ చేయాల్సి ఉంది. ఇది కష్టమే. రైతు ధాన్యం విక్రయం కోసం వేసి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఇలా చేస్తే సరిపోతుంది...

ప్రతి ఆర్ఎస్‌కేలోనూ నిబంధనల ప్రకారం బ్యాంకు గ్యారంటీలు ఉన్న రైస్ మిల్లులును అనుసంధానం చేయాలి. తద్వారా రైతు తనకు నచ్చిన, తన పంటకు ఎక్కువ ధర చెల్లించే మిల్లును ఎంపిక చేసుకోవచ్చు. కానీ అధికారులు ఈ విధంగా చర్యలు చేపట్టట్లేదు. కొర్రీలు పెడుతున్నారు. దీంతో రైతులు అదనంగా వచ్చే ఆదాయం కోల్పోతున్నారు. ప్రభుత్వ పెద్దలు ఇక్కడి లోపాలను గుర్తించి తమకు మరింత మేలు చేసే విధంగా నిర్ణయాలు చేయాలని, స్వేచ్ఛగా తమకు నచ్చిన మిల్లుకు అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నీటిలోనే బాత్‌రూమ్ నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

నాణ్యతకు తిలోదకాలు

నాసిరకం తలుపుల ఏర్పాటు

నీరు తోడకుండానే బాత్‌రూమ్ నిర్మాణ పనులు

పనికిరాని ఇసుకతో తూతూమంత్రంగా పనులు

ప్రజాప్రతినిధుల ఆగ్రహం

పనులు నిలిపివేయించిన వైద్యాధికారి

ఇదీ పెదగాడవిల్లి పశువుల ఆసుపత్రి దుస్థితి



ఉప్పలగుప్తం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెదగాడవిల్లి పశువుల ఆసుపత్రి భవనం రెండవ దశ పనుల్లో నాణ్యత లేదంటూ స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరు చెప్పినా వినకుండా కాంట్రాక్టర్ నీటిలోనే కొనసాగిస్తున్న పనులను పశువైద్యాధికారిణి ఎం.నిరోషా ఆదివారం నిలిపివేయించారు. ఉపయోగిస్తున్న ఇసుకలో ఏమాత్రం నాణ్యత లేదని వ్యాఖ్యానించారు. అయినాపురం పంట కాల్వ సమీపంలో పెదగాడవిల్లి పంచాయతీ భవనం పక్కనే పశువుల ఆసుపత్రికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబీకులు స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. 2018లో రూ.18 లక్షల అంచనా వ్యయంతో ఆసుపత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. నిర్మాణం పూర్తయినప్పటికీ ఫ్లోరింగ్, తలుపులు, బాత్‌రూమ్‌లు, ట్రావీస్ (పశువుల బోన్‌లు), రక్షణ గోడ వంటి ఇతర పనులు పెండింగులో ఉన్నాయి. రెండో దశలో వీటిని పూర్తి చేసేందుకు రూ.12లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులను వేరే కాంట్రాక్టర్ తీసుకున్నారు. భవనానికి ఏర్పాటు చేసిన తలుపుల క్వాలిటీపై రైతులు, వైద్యాధికారి, సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలల వ్యవధిలోనే తలుపులు పాడైపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాత్‌రూమ్ నిర్మాణ దశలో ఉంది. నీటిలోనే నిర్మాణ పనులు చేస్తున్నారు. స్థానికులు ప్రశ్నించినాకాంట్రాక్టర్ పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తున్నట్టు స్థానికులు, పశువైద్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులకు వాడే ఇసుకలో ఏమాత్రం నాణ్యత లేదని స్థానిక ఎంపీటీసీ నిమ్మకాయల వెంకటస్వామినాయుడు సహా కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. నీటిలో పనులు కొనసాగించడంపై పశువైద్యాధికారిణి నిరోషా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె వచ్చి పనులను నిలిపివేయించారు. ఈ పనులే ఇలా ఉంటే రక్షణ గోడ , పశువులకు ట్రావీస్ నిర్మాణం, ఇతర ఫినిషింగ్ పనులు ఎలా ఉంటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపామని కూటమి నాయకులు చెప్పారు.రైతులందరికీ ఉపయోగపడే ఆసుపత్రి భవనం పనులు నాసిరకంగా ఉంటే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించిన్యాయం చెయ్యాలని కోరుతున్నారు.


పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకుంటాం

రూపేష్, ఏఈ, వ్యవసాయ మార్కెట్ కమిటీ విభాగం

పెదగాడవిల్లి పశువుల ఆసుపత్రి భవనం నిర్మాణం ఇది వరకే పూర్తయ్యింది. మిగిలిన పనులకు రెండో విడతగా రూ.12 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. స్థానిక ఎంపీటీసీకి, పశువైద్య సిబ్బందికి వివరించిన అనంతరం పనులు ప్రారంభమయ్యాయి. పనుల్లోనాణ్యత ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటాం. పనుల విషయంలో ఇంజనీరింగ్ విభాగం ఏమాత్రం రాజీపడే ప్రసక్తే లేదు. త్వరలోనే పనులు పూర్తిచేసి భవనాన్ని ప్రారంభానికి సిద్ధం చేస్తాం.



నిర్మాణ పనులకు తెచ్చిన నాసిరకం ఇసుక



నిహారిక అందించిన నిధుల చెక్కులను పంచాయతీల సర్పంచ్‌లకు అందజేస్తున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

గ్రామ పంచాయతీల అభివృద్ధికి

నిహారిక రూ.5 లక్షల విరాళం

పది మంది సర్పంచ్‌లకు అందజేసిన జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్/పి.గన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాలనే సంకల్పంతో గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బాటలోనే జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు కుమార్తె నిహారిక నడుస్తున్నారు. ఒక్కో పంచాయతీ అభివృద్ధికి రూ.50వేలు వంతున పది గ్రామాలకు రూ.5లక్షల విరాళాన్ని ప్రకటించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ నివాసంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం మండలం జి.పెదపూడి, ఉడిమూడి, పెదపట్నం, నాగుల్లంక, ఎల్.గన్నవరం, మామిడికుదురు మండలం పాశర్లపూడి, పాశర్లపూడిలంక, అప్పనపల్లి, పెదపట్నం, పెదపట్నంలంక గ్రామాల సర్పంచ్‌లకు రూ.50వేలు చొప్పున నాగబాబు అందజేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ సర్పంచ్‌లకు ప్రత్యేక గౌరవం కల్పించి పంచాయతీలను ప్రగతి పథంలో నడిపించడమే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ లక్ష్యమన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవాలనే పవన్ సూచనలకు అనుగుణంగా నిహారిక ముందుకు వచ్చారన్నారు. పవన్ బాటలో నడిచేందుకు కుటుంబసభ్యులు ముందుకు వస్తున్నారని తెలిపారు. తొలుత సర్పంచ్‌లు నాగబాబుకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. లంకలగన్నవరం సర్పంచ్ పసలపూడి రామకృష్ణ డొక్కా సీతమ్మ చిత్రపటాన్ని అందించి తమ గ్రామం రావాలని కోరారు. కార్యక్రమంలో నూకపెయ్యి ప్రసన్న కుమార్, గుడాల రామారావు, దంగేటి అన్నవరం, యల్లమిల్లి కృష్ణవేణి, రామకృష్ణ పాల్గొన్నారు.



'అంతర్వేది'కి పోటెత్తిన భక్తులు... 8లో

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 18 నవంబరు 2024



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
4. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
5. జా రాంఝన్ (దో పత్తీ)
6. ఆయీ నై (స్త్రీ-2)
7. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
8. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

సెలబ్ టాక్

దేనికైనా రెడీ..!



బాలీవుడ్‌లోకి మరో వారసురాలు వచ్చింది. ఆమె ఎవరో కాదు... హీరో వరుణ్ ధావన్ అన్న కూతురు... 'బిన్నీ అండ్ ఫ్యామిలీ' కథానాయిక... అంజినీ ధావన్. వెండితెరపై వెలిగిపోవాలన్న ఆశయంతో... కొన్నేళ్లు పరిశ్రమలోనే పని చేసి... అనుభవం గడించింది. తొలి చిత్రంతోనే మంచి హిట్ సొంతం చేసుకోవడమే కాదు... అగ్ర నటుల ప్రశంసలు కూడా అందుకుంది.

అంజినీ ఇంట్లో అందరూ సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. తాతయ్య అనిల్ ధావన్ వెటరన్ నటుడు. ఆయన కుమారుడు, అంజినీ తండ్రి సిద్ధార్థ్ ధావన్ బుల్లితెర నటుడు. హిట్ చిత్రాల దర్శకుడు డేవిడ్ ధావన్ పినతాత. డేవిడ్ తనయుడు, ప్రముఖ హీరో వరుణ్ ధావన్ ఆమెకు వరుసకు బాబాయి. చిన్నప్పటి నుంచీ సినీ వాతావరణంలోనే గడిపిన అంజినీకి సాధారణంగానే నటనపై మక్కువ పెరుగుతూ వచ్చింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఆమె... డిగ్రీ తరువాత కెరీర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. అయితే కుటుంబ నేపథ్యం, ఇంట్లోవాళ్ల ప్రోత్సాహం ఉన్నా... తొలుత తనను తాను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని అనుకుంది. ఆ తరువాతే తెర మీద కనిపించాలనే పట్టుదలతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిశ్రమలో అడుగుపెట్టింది. వరుణ్ ధావన్ 'కూలీ నంబర్-1'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసింది. అప్పుడప్పుడూ బామ్మ రష్మీ ధావన్ యాక్టింగ్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి నటనలో మెళకువలు కూడా నేర్చుకుంది. ఇలా ఎక్కడ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకొంటూ... తనలోని నటికి మరిన్ని వన్నెలద్దింది. వీటన్నిటి ఫలితం తొలి చిత్రం 'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లోనే కనిపించింది. సినిమా చూసినవారందరూ... ఆమెకు అది మొదటి సినిమా అనుకోలేదట. అంతలా అదరగొట్టింది నటనలో. ఇక ఎంతో సహజంగా నటించిందనేది విమర్శకుల మాట.

వేరొక ఆడిషన్‌లో చూసి...

'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లో అవకాశం కూడా విచిత్రంగా వచ్చింది అంజినీకి. "వేరొక సినిమా కోసం ఏడాదిగా ఆడిషన్లు ఇస్తున్నా. అది సంజయ్ త్రిపాఠీ దృష్టిలో పడింది. తను తీయబోయే చిత్రంలో 'బిన్నీ' పాత్రకు నేనైతే సరిగ్గా సరిపోతానని ఆయన భావించారట. వెంటనే నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. నా నటన నచ్చింది. అలా 'బిన్నీ అండ్ ఫ్యామిలీ'లో అవకాశం రావడమే కాదు... నటిగా నా కెరీర్ కూడా ప్రారంభమైంది" అంటూ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది అంజినీ.



'నా జీవితానికి దగ్గరైన పాత్ర'...

ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను లండన్‌లో చిత్రీకరించాడు సంజయ్. నెల రోజులపాటు సాగిన ఆ షెడ్యూల్‌లో 'పంకజ్ కపూర్, హిమని శివ్‌పురి, రాజేష్‌కుమార్ లాంటి సీనియర్లతో కలిసి పని చేయడంవల్ల ఎంతో నేర్చుకొనే అవకాశం లభించింది. అంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. నెల రోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. అదీకాకుండా 'బిన్నీ' పాత్ర నిజ జీవితంలో నాకు చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా బామ్మ పాత్రధారి నా చిరిగినట్లుండే ఫ్యాషన్ జీన్స్ చూసి ఇదేంటని ప్రశ్నించినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చారు. ఆయన కూడా ఇంట్లో నా డ్రెస్‌లు చూసి జోకులు వేసేవారు' అంటూ తన అనుభవాలు పంచుకుంది అంజినీ. డేవిడ్, వరుణ్ ధావన్ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లోనే కాకుండా, షూటింగ్ సమయంలో కూడా వరుణ్ అంజినీకి మద్దతుగా నిలిచాడు. తన ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో ఆమె గురించి, ఆమె చిత్రం గురించిన విశేషాలను పంచుకున్నాడు. సినిమా విడుదల తరువాత కూడా అంజినీని ప్రత్యేకంగా అభినందించాడు.

నిరూపించుకొంటేనే...

"నా సినిమా విడుదలకు ముందు కొందరు 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి మరో నిదర్శనం' అంటూ కించపరిచేలా నాపై వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో పరిచయాలవల్ల కష్టపడకుండానే మొదట్లో ఒకటి రెండు అవకాశాలు వస్తాయేమో! కానీ మనలో సామర్థ్యం లేకపోతే ఇక్కడే కాదు, ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేము. మనల్ని మనం నిరూపించుకొంటేనే మనుగడ. నటిగా తెరమీద కనిపించడానికి ముందు సినీ నిర్మాణంలో ప్రతి క్రాఫ్ట్ గురించీ తెలుసుకోవాలని అనుకున్నాను. అందుకే తొలుత బాబాయి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. షూటింగ్ స్పాట్‌కు ఉదయాన్నే వెళ్లిపోయేదాన్ని. కెమెరా, లైటింగ్, లోకేషన్లు... ఇలా అన్నిటి మీద ఒక అవగాహన వచ్చాకనే నటన గురించి ఆలోచించాను" అంటుంది అంజినీ.

మంచి స్నేహితులు...

'కూలీ నంబర్-1' షూటింగ్‌లో వరుణ్, ఆ చిత్ర కథానాయిక సారా అలీఖాన్‌తో ఎంతో సరదాగా గడిచిపోయేదని, తారలపై వచ్చే గాసిప్స్ మీద మాట్లాడుకొని నవ్వుకొనేవారమని చెప్పింది ఇరవై నాలుగేళ్ల అంజినీ. 'వరుణ్‌ను ఎప్పుడూ బాబాయిగా చూడలేదు. అన్నయ్యలాగా భావిస్తాను. తను నన్ను ఎంతో గారాబంగా చూసుకొంటాడు' అంటున్న అంజినీకి సంజయ్ కపూర్ కుమార్తె, నటి షనయ కపూర్, బోనీ- శ్రీదేవిల చిన్న కూతురు ఖుషీ కపూర్ మంచి మిత్రులు. 'నా సినిమా ప్రివ్యూ నుంచి బయటకు వచ్చేటప్పుడు వాళ్ల కళ్లు చెమర్చాయి. నా నటన బాగుందని అభినందించారు' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది అంజినీ.

అన్నీ చెయ్యాలి...

మొదటి చిత్రంతోనే మంచి నటిగా ప్రశంసలు అందుకున్న అంజినీ... భవిష్యత్తులో అన్ని రకాల పాత్రలూ చేయాలని అనుకొంటోంది. 'యాక్షన్, కామెడీ, ప్రేమ కథలు, సైకో థ్రిల్లర్లు అనే తేడా లేకుండా ప్రతి పాత్రా పోషించాలి. విలక్షణ నటిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి'... అని కోరుకొంటున్న అంజినీ ఏ పాత్రకైనా రెడీ అంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ కూడా తక్కువేంలేరు. ఫ్యాషన్ ఐకాన్‌గా తెరంగేట్రానికి ముందే లక్షలమంది అభిమానులను సంపాదించుకున్న ఆమె... తరచూ వెరైటీ డ్రెస్సుల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటికి లైక్‌లూ లక్షల్లోనే. ఫిట్‌గా ఉండటానికి యోగా, జిమ్నాస్టిక్స్‌ను తన దినచర్యల్లో భాగంగా చేసుకుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఆ స్వేచ్ఛ మాకూ ఉంది

- విష్వక్‌సేన్

'ఒక సినిమా బాగోగుల గురించి విమర్శకులు, సమీక్షకులు ఎంతటి విశ్లేషణ అయినా చేయవచ్చు కానీ ఆ వంకతో వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా ఉండకూడదు. మీలాగా మాకూ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని గుర్తుంచుకోవాలి' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథా



నాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "మెకానిక్ రాకీతో మా నిర్మాత రామ్ గర్వపడేలా చేస్తా. పది సినిమాల అనుభవంతో చెబుతున్నా మంచి సినిమా తీశాం. ఐదు నిమిషాలు కూడా బోర్‌కొట్టదు. మా సినిమాను ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విష్వక్‌సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయి. మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. యువతను, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కిన చిత్రమిదని మీనాక్షి చౌదరి తెలిపారు. సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రమిదని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

కొత్తగా...

రిమాండ్‌కు కస్తూరి



తమిళ నాడులో నివసిస్తున్న తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 12 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 'అధికార దుర్వినియోగాన్ని ముగింపు పలికి న్యాయాన్ని గెలిపించాల'ని కోర్టు వెలుపల కస్తూరి మీడియాతో అన్నారు. మధురై కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో హైదరాబాద్‌లో తలదాచుకున్న కస్తూరిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే.



పట్నాలో పుష్ప రూల్

'నేను మొదటిసారి బిహార్‌కు వచ్చాను. నా హిందీ అంత బావుండదు. తప్పులు మాట్లాడితే క్షమించండి. ఎవరికీ తలవంచని పుష్ప నేడు మీ ముందు తలవంచుతున్నాడు. మీ అభిమానమే 'పుష్ప 2: ది రూల్' లాంటి మంచి చిత్రాన్ని తీయడానికి మాకు ప్రేరణ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని బిహార్ రాజధాని పట్నాలో భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ "పుష్ప' చిత్రాన్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యిందంటే ఆ గొప్పదనం నాది కాదు, ప్రేక్షకులదే. మీ ప్రేమే 'పుష్ప 2: ది రూల్' చిత్రాన్ని ఇంత గొప్పగా తీయడానికి కారణమైంది. డిసెంబర్ 5న మీ ముందుకు రాబోతోంది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'ఇంతమంది అభిమానులు 'పుష్ప' ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలుగా అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మీ అందరి అంచనాలకు మించి సినిమా ఉండబోతోంది' అని తెలిపారు. 'పట్నా ప్రజల నుంచి ఈ స్థాయి ఆదరణను ఊహించలేదు. ఈ గొప్పదనం అల్లు అర్జున్, సుకుమార్‌కు దక్కుతుంది' అని నిర్మాత యలమంచిలి రవి, నవీన్ యెర్నేని తెలిపారు. 'పుష్ప 2' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం భారీ ఎన్నికల ప్రచార సభను తలపించింది. దేశవ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు తరలివచ్చారు. గాంధీ మైదానం జనాలతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షలమంది హాజరయ్యారని అంచనా. "పుష్ప అంటే ఫైర్ కాదు వైల్డ్ ఫైర్ అంటూ ఆయన చెప్పిన డైలాగ్‌లకు అభిమానుల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుపాలకుడిగా ప్రణవ్



వెండితెరపైన సాదా సీదా పాత్రలను అద్భుతంగా పోషించే తారలు నిజ జీవితంలో అలా జీవించగలరా? అంటే 'కష్టమే' అని చెప్పాలి. కానీ మలయాళ మెగా స్టార్ మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ మాత్రం స్టార్‌డమ్‌ను పక్కన పెట్టి దేశం కాని దేశంలో అనామకంగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో 'వర్క్ అవే' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఓ పొలంలో కష్టపడి పనిచేస్తున్నారు. పశుపాలకుడిగా గొర్రెలు, మేకలు, గుర్రాలను కాస్తున్నారు ప్రణవ్. నటుడిగా పోషించాల్సిన విభిన్న పాత్రల్ని తన కొడుకు నిజజీవితంలో పోషిస్తున్నారని ప్రణవ్ తల్లి సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఒక సూపర్‌స్టార్‌కి కొడుకు, ఆగర్భ శ్రీమంతుడు అయినా విలాసవంతమైన జీవన శైలిని వదిలి ఇలా సాదాసీదాగా గడుపుతున్న ప్రణవ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. 2002లో 'ఒన్నమన్' అనే సినిమాతో బాలనటుడిగా అరంగేట్రం చేసిన ప్రణవ్.. 'పునర్జనీ' చిత్రంతో ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డు అందుకున్నారు. 2018లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో 'ఆది' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్లు అందుకున్న చిత్రంగా నిలవడమే కాకుండా ప్రణవ్‌కు ఉత్తమ నటుడిగా సైమా అవార్డునూ తెచ్చిపెట్టింది. ప్రణవ్ కేవలం నటుడిగానే కాకుండా ప్లేబ్యాక్ సింగర్‌గా, పాటల రచయితగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

గాయకుడు అనురాగ్ కులకర్ణి, గాయని రమ్య బెహర వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకకి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. కొద్దిమంది కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా, సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం గోల్కొండ రిసార్ట్స్‌లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ వేడుకలో ఆంధ్రజ్యోతి గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



రూ. పదికోట్ల వీడియో ఫ్రీగా చూడండి



నటి నయనతార బయోపిక్‌గా నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'. దీనికోసం 'నానుమ్ రౌడీ దాన్' సినిమా సమయంలో షూట్ చేసిన మూడు సెకన్ల క్లిప్‌ను వాడుకున్నందుకు రూ.పది కోట్లు ఇవ్వాలని నటుడు, నిర్మాత ధనుష్ కోరారని.. ఇందుకు ఆయనని విమర్శిస్తూ నయనతార ఓ బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నయనతారను సపోర్ట్ చేస్తూ ఆదివారం ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండు పోస్టులు పెట్టారు. అందులో ఒక దాంట్లో.."కేవలం మూడు సెకన్లకు ధనుశ్ రూ.పది కోట్లు డిమాండ్ చేసిన వీడియో ఇదే. మీరంతా ఫ్రీగా చూసేయ్యండి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతటితో ఆగకుండా... మరో పోస్ట్‌లో.. 2017లో 'సక్క పొడు పొడు రాజా' సినిమా ఆడియో ఫంక్షన్‌లో ధనుశ్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. అందులో ప్రేమను పంచడం గురించి.. నటీనటులు పనిచేసే చోట ఉండాల్సిన వాతావరణం గురించి ధనుశ్ మాట్లాడారు. ఆ వీడియోకి కౌంటర్‌గా "జీవించండి.. ఇతరులని స్వేచ్ఛగా జీవించనివ్వండి. ప్రేమను పంచండి.. ఓం నమః శివాయ. మీరు చెప్పినవి ముందు మీరు పాటించండి. కనీసం మీ అభిమానుల కోసమైనా" అని పేర్కొన్నారు. అయితే ఈ పోస్టులను కొద్దిసేపటికే విఘ్నేష్ శివన్ తొలగించడం గమనార్హం. మరోవైపు గాయని సుచిత్ర, ధనుశ్ ఎంతో మంది హీరోయిన్లను వేధించారని ఆరోపించారు.



పాపికొండలకు పోటెత్తిన పర్యాటకులు


పాపికొండల విహారయాత్రకు వెళుతున్న పర్యాటక బోటు

దేవీపట్నం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహారయాత్రకు పర్యాటకుల రద్దీ పెరిగింది. కార్తీకమాసం సందర్భంగా పేరంటాలపల్లిలో ఉన్న శివుడిని దర్శించుకునేందుకు పర్యాటకులు ఇరురాష్ట్రాల నుంచి ఆదివారం భారీగా తరలివచ్చారు. 12 బోట్లలో సుమారు 800 మంది పర్యాటకులు గోదావరి పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పాపికొండలు వెళ్లారు. మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి దర్శనం అనంతరం పోశమ్మగండి బోటుపాయింట్ నుంచి వెళ్లారు. అలాగే పాపికొండలు విహారయాత్రకు వెళ్లే పర్యాటకులు మద్యం తీసుకెళ్లరాదని దేవీపట్నం ఎస్‌ఐ షరీఫ్ అన్నారు.

రాయవరం నుంచి శివస్వాముల శ్రీశైలం పాదయాత్ర


రాయవరం నుంచి శ్రీశైలం పాదయాత్ర చేస్తున్న శివస్వాములు.

రాయవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని శివమాల ధరించిన ముగ్గురు శివస్వాములు ఆదివారం రాయవరం అన్నపూర్ణ సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. గ్రామానికి చెందిన గుడాల సూరిబాబు గురుస్వామితోపాటు మరో ఇద్దరు శివస్వాములు రాయవరం నుంచి బయలుదేరి శ్రీశైలం బయలుదేరారు. 12 రోజులపాటు యాత్ర సాగుతుందని గుడాల సూరిబాబు శివస్వామి తెలిపారు. రాయవరం నుంచి పాదయాత్రగా బయలుదేరిన శివస్వాములకు గ్రామంలో శివస్వాములు గ్రామశివారు వరకు భక్తిగీతాలు ఆలపిస్తూ వెళ్లి వీడ్కోలు పలికారు. తొలుతగా శివస్వాములు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు

కరుణించవయ్యా సత్యదేవా!

రత్నగిరికి పోటెత్తిన భక్తులు

● రూ.70లక్షల ఆదాయం


స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచియున్న భక్తులు

అన్నవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి కార్తీక మాసం, ఆదివారం సెలవుదినం కావడంతో అశేష భక్తజనంతో పోటెత్తింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని శనివారంరాత్రి ఒంటిగంట నుంచి వ్రతాలు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. ఉదయం 8గంటల వరకు సాధారణంగా ఉన్న రద్దీ 8తరువాత ఊహించని రీతిలో భక్తులు తరలివచ్చారు. ఆదివారం ఒక్కరోజు సుమారు 8వేల జంటలు స్వామివారి వ్రతమాచరించగా వివిధ విభాగాల ద్వారా రూ.70లక్షల ఆదాయం లభించింది. ఈవో రామచంద్రమోహన్ రద్దీ తగ్గేవరకు క్యూలైన్లవద్ద ఉండి పర్యవేక్షించారు. వ్రతంటిక్కెట్లు తీసుకున్న భక్తులను కంపార్ట్‌మెంట్‌లలో ఉంచి వ్రతమండపాలు ఖాళీ అయ్యాక వ్రతం భక్తులను అనుమతిస్తుండడంతో క్యూలైన్లన్నీ సాఫీగా జరుగుతున్నాయి. సుమారు 70వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అంత్రాలయం, యంత్రాలయ దర్శనాలు నిలుపుదల చేశారు.

మధుచందనకు మరో బంగారు పతకం

చింతూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో గుత్తుల మధుచందన మరో బంగారు పతకం సొంతం చేసుకుంది. దీంతో మధు చందన కైవసం చేసుకున్న పతకాల సంఖ్య 38కి చేరాయి. గుడివాడ ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో శని, ఆదివారం రెండు రోజులపాటు వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. 2024-25 నాటి అండర్-19 విభాగంలో +87 కేటగిరి 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో మధుచందన పోటీ పడింది. ఈ క్రమంలో మధు చందన బంగారు పతకం సొంతం చేసుకుంది. చింతూరుకు చెందిన మధు చందన స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ పోటీల లో మధుచందన బంగారు పతకం కైవసం చేసుకోవడంతో డిసెంబరు 9 నుంచి 15వరకు ఢిల్లీలో జరగబోయే 68వ జాతీయ స్కూల్‌గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 2024-25 నాటి పోటీలకు అర్హత సాధించారు. వరుస పతకాలు సాధిస్తున్న మదుచందనకు ఆమెకు శిక్షణ ఇస్తున్న గోలి గంగాధర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.


బంగారు పతకంతో మధుచందన

ఆయన రచనలు.. నేటికీ సజీవమే!

» మరణించినా.. నినదిస్తున్న కలం తూటాలు

» అందరి హృదయాల్లో ప్రతిధ్వనిస్తున్న అక్షరాయుధాలు

» నేడు వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ శత జయంతి

(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

'రండి రండి ఉక్కుముక్కు కాకుల్లారా
రండర్రా గద్దల్లారా రండి రండి
సమరంలో క్షతగాత్రుడనై పడిపోయిన
నా శరీరాన్ని తినివేయండి..' అంటూ సోమసుందర్ క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్టయి లాకప్‌లో పోలీసు లాఠీ దెబ్బలకు విలవిల్లాడుతున్న సమయంలో ఉరిమిన కలం నుంచి వెలువడడం ప్రారంభించిన మాటల తూటాలు, అక్షరాయుధాలు నేటికీ అందరి హృదయాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. తెలంగాణా సాయుధ పోరాటం సమయంలోను కలంతో నినదించిన 'వజ్రాయుధ' కవి, విమర్శకుడు, సమీక్షకుడు, అనువాదకుడు, కథా రచయిత, పత్రికా సంపాదకుడు అక్షరతపస్వి, అభ్యుదయవాది డాక్టర్ ఆవంత్స సోమసుందర్ శతజయంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

1924, నవంబరు 18న తూర్పుగోదావరి జిల్లా శంఖవరంలో కాశ్లూరి సూర్యప్రకాశరావు, వెంకాయమ్మ దంపతులకు జన్మించారు. 1929లో పిఠాపురంలోని పినతల్లి ఆవంత్స చిట్టి వెంకాయమ్మ, వెంకట్రావు దత్తత తీసుకున్నారు. దీంతో ఇంటి పేరు మారి ఆవంత్స సోమసుందర్ అయ్యారు. దత్తత తల్లి వెంకాయమ్మకు సాహిత్యంపై ఉన్న ఆసక్తి సోమసుందర్‌కు కలిగింది. 13వ ఏటనే కవిత్వ రచన చేసేలా ఉరికొల్పింది. ప్రాథమిక విద్య పిఠాపురంలోనూ, ఉన్నత విద్యను కాకినాడ పీఆర్ కళాశాలలోనూ చదివారు.

వజ్రాయుధాలు సంధించారు ఇలా..

స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా జరిగిన పోరాటాల్లో సోమసుందర్ చురుగ్గా పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని అరెస్టయి, తుని సబ్‌జైలులో జైలుశిక్ష అనుభవించారు. జైలులో ఉన్న సమయంలోనే ఆయన అభ్యుదయ కవిత్వం వైపు మరలారు. అక్కడే వజ్రాయుధానికి బీజం పడింది. 1944 నుంచి 48 వరకూ రాసిన కవితలను ఎంపిక చేసి 1949, మార్చిలో వజ్రాయుధాన్ని ముద్రించారు. సమాజంలో ఉద్రిక్తతలు రెచ్చగొడుతుందంటూ 1950, ఫిబ్రవరి 6న అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం వజ్రాయుధాన్ని నిషేధించింది. 1956లో నిషేధాన్ని ఎత్తివేశారు. దీన్ని హిందీ, మరాఠీ భాషల్లో అనువదించారు. ఆరోగ్యం సహకరించకున్నా, ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా 2016, ఆగస్టు 12న మరణించే వరకూ సోమసుందర్ కలం ఆగలేదు. 125కి పైగా గ్రంథాలు, కథానికలు రచించారు. వీటిల్లో గోదావరి జలప్రళయం, కాగళి, వెన్నెల్లో కోనసీమ, మా ఊరు మారింది, జీవనలిపి, ఆర్రుపర్తి తదితరాలు ప్రాచుర్యం పొందాయి. ఆంధ్రరాష్ట్ర ఉద్యమ సమయంలో రాసిన కాహళితోపాటు విజ్ఞానశాస్త్ర, యాత్రాస్థలాలు సందర్శన నేపథ్యాల్లోను, విమర్శనా గ్రంథాలుగా, అనువాదం గ్రంథాలుగా అనేకం రచించారు. కలలు-కన్నీళ్లు పేరిట ఆత్మకథను రాసుకున్నారు. అనారోగ్యానికి గురైనా సహాయకుల సహకారంతో రచనలు కొనసాగించారు. కవులపై రాసిన వ్యాసాలతో కూడిన శరచ్చంద్రిక పుస్తకాన్ని రచించి అప్పటి రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ షష్టిపూర్తి సందర్భంగా బహుమతిగా అందజేశారు. ఇదే ఆయన చివరి రచన.

పరిచయం లేకున్నా అభినందనలకు ముందు

తాను ప్రఖ్యాత కవి, విమర్శకుడు అనే గర్వం ఏనాడు సోమసుందర్‌కు ఉండేది కాదు. ఎవరి రచనలు అ యినా బాగున్నప్పుడు వారు తన కు పరిచయం లేకున్నా అభినందించడం లో ముందుండేవారు. తన తోటి సాహితీవేత్తలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2001లో సోమసుందర్ లిటరరీ ట్రస్టు ప్రారంభించి ఏటా పురస్కారా లు అందజేస్తూ వచ్చారు. తనకు లభించిన పురస్కారాల ద్వారా వచ్చిన నగదు, తన పేరు న ఉన్న ఆస్తులను అమ్మి ఈ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ప్రతిఏటా ఆయా రంగాల్లో ప్రముఖులకు డాక్టర్ ఆవంత్స సోమసుందర్ సాహిత్య పురస్కారం, రాజహంస కృష్ణశాస్త్రి పురస్కా రం, రాంషా స్మారక విమర్శక పురస్కారం, గురజాడ కథాప్రభాస పురస్కారాలను ప్రముఖులకు అందజేశారు. తాను మరణించిన తర్వాత ట్రస్టు నిరతంరం కొనసాగాలన్న తపనతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు.



పురస్కారాల వెల్లువ

సోమసుందర్‌కు పురస్కారాలు, అవార్డులు, సత్కారాలు లభించాయి. 1979లో అత్యంత ప్రతిష్టాత్మకమైన సోవియెట్ ల్యాండ్ నెహ్రూ బహుమతిని, 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఆత్మగౌరవ పురస్కారం లభించింది. ఇదే గాక 2008లో ఎన్టీఆర్ జాతీయ స్మారక అవార్డు, రాజ్యలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, రాజారామ్ సాహితి పురస్కారం, కళారత్న పురస్కారం, లోక్‌నాయక్ పురస్కారం, గురజాడ 150వ జన్మదిన పురస్కారం, విశాలాంధ్ర విశిష్ట సత్కారాలు పొందగా, పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, గౌరవ డాక్టరేట్ పొందారు.


డాక్టర్ ఆవంత్స సోమసుందర్

మా సో.సు అంటారు..

సోమసుందర్ అభిమానులు, స్నేహితులు, పరిచయస్తులు ఆయనను అభిమానంగా సో.సు అని పిలుచుకుంటారు. ఆయన అభిమానంగా తిట్లు తిడితే వాటిని వారు దీవెనలుగా భావించేవారు. సోమసుందర్ తాను మరణించిన తర్వాత తన పార్థీవదేహాన్ని రంగరాయ మెడికల్ కళాశాలకు అందివ్వాలని కోరి అందరికీ ఆదర్శంగా నిలిచారు. కుటుంబసభ్యులు ఆయన కోరికను అమలు చేశారు. ఆయన మరణించి ఎనిమిదేళ్లు దాటుతున్నా సో.సు మాత్రం అందరి హృదయాల్లో చిరస్థాయిగా గూడు కట్టుకునే ఉన్నారు. శత జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు


అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో భక్తుల రద్దీ

అయినవిల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తడంతో ఆలయం కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారికి అభిషేకాలు పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. లక్ష్మీగణపతి హోమం, లఘున్యాసాలు జరిగాయి. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ మండపాలు భక్తులతో కిక్కిరిశాయి. స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లో గంటల కొలదీ భక్తులు బారులు తీరారు. ఆలయ సహాయ కమిషనర్, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక దర్శనాలు రద్దుచేసి భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పించారు. కార్తీకమాసం ఆదివారం కావడంతో అయినవిల్లి సిద్ధివినాయక దేవస్థానం వద్ద భక్తులు, వాహనాల రద్దీతో ట్రాఫిక్ స్తంభించింది. ముక్తేశ్వరం సెంటర్ వద్ద కూడా భక్తులు వాహనాలతో రద్దీ నెలకొంది.

లోవ తలుపులమ్మ ఆదాయం రూ.1.91లక్షలు



తుని రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానం ఆదివారం భక్తుల కోలాహలంగా మారింది. పవిత్ర కార్తీక మాసం పర్వదినాలు కావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి అమ్మవారి దర్శనార్థం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవారిని సర్వాంగత సుందరంగా అలంకరించిన అర్చక స్వాములు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజే 10వేల మంది పైబడి భక్తులు దర్శించుకోగా ఆలయానికి రూ.1.91లక్షల ఆదాయం సమకూరింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులుప్రత్యేక ఏర్పాట్లు చేయగా రూరల్ పోలీసులు లోవ ప్రాంగణం లో బందోబస్తు ఏర్పాటుచేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు చేపట్టారు.

పాదగయలో జడ్పీ సీఈవో పూజలు

పిఠాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ఉమ్మడి విశాఖ జిల్లాపరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి ఆదివారం సాయంత్రం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వర, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహుతికా అమ్మవార్లను సతీసమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. సీఈవో దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు పలకగా, ఆలయ అధికారులు ప్రసాదాలు అందజేశారు.


పిఠాపురం పాదగయ క్షేత్రంలో విశాఖ జడ్పీ సీఈవో నారాయణమూర్తి

బాలబాలాజీ దేవస్థానంలో భక్తుల కోలాహలం

మామిడికుదురు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఆదివారం భక్తుల కోలాహలంతో కళకళ్లాడింది. కార్తీకమాసం ఆదివారం కావడంతో అధికసంఖ్యలో స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. వైనతేయనదిలో స్నానమాచరించి దేవస్థానంలో నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాలద్వారా రూ.4,35, 067 ఆదాయం వచ్చిందని సహాయకమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

వలస ఆదివాసీల సమస్యను పరిష్కరించండి


కేంద్ర గిరిజన శాఖ మంత్రి జ్యురల్ ఓరాంని సన్మానిస్తున్న ఆదివాసీ వికాస సంఘం నాయకుడు పొడియం ధన బృందం

చింతూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి తెలుగు రాష్ట్రాలలో జీవిస్తున్న వలస ఆదివాసీల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదివాసీ వికాస సంఘ నాయకుడు పొడియం ధన కోరారు. ఈ మేరకు తమ బృందం ఆదివారం ఢిల్లీలో స్వర్ణ జయంతి ఆడిటోరియంలో కేంద్ర గిరిజనశాఖ మంత్రి జ్యురల్ ఓరాంని కలసి వినతి పత్రం ఇచ్చినట్లు ఆంధ్రజ్యోతికి పొడియం ధన తెలిపారు. వలస ఆదివాసీల సంతతికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో ఉన్నత చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. భారతీయులైన వలస ఆదివాసీలు తెలుగు రాష్ట్రాలలో ద్వితీయ శ్రేణి పౌరులుగా జీవించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వలస ఆదివాసీల సమస్యలు తెలుసుకున్న కేంద్రమంత్రి జ్యురల్ ఓరాం ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని తమకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా వలస ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసిన పులుగుజ్జు సురేష్‌కు గిరిజన శాఖ మంత్రి చేతుల మీదుగా బిర్సా ముండా జాతీయ అవార్డు ప్రధానం చేశారన్నారు. లిబ్టు డైరెక్టర్ ఏసురత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివుని చెంత మందుబాబుల చిందులు


పూతిగుంట జలపాతాల వద చిందులు వేస్తున్న మందుబాబులు

వై.రామవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పరమ పవిత్రమైన శివాలయం చెంతనే మందుబాబులు మందుకొడుతూ విహారయాత్రికులను, అయ్యప్పభక్తులను హడలెత్తించిన సంఘటన ఆదివారం అల్లూరి జిల్లా వై.రామవరం మండలం పరిధిలోని పూతిగుంట శివాలయం వద్ద చోటుచేసుకుంది. పూతిగుంటకు సమీపంలోనే చవిటిదిబ్బలలో బ్రాందీషాపు ఉంది. కార్తీకమాసం సందర్భంగా పలు ప్రాంతాల నుంచి పూతిగుంట శివాలయానికి విహారయాత్రికులతోపాటు భవానీ, అయ్యప్పమాలదారు లు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఇదే సమయంలో ఆదివారం కొందరు మందుబాబులు ఇక్కడికి వచ్చి జలపాతాల వద్ద మందుకొడుతూ చిందులు వేస్తూ కేకలు వేయడంతో భక్తులు భయభ్రాంతులకు గురవుతూ ఆందోళన చెందారు.

హోరాహోరీగా హాకీ పోటీలు


రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

కాకినాడ అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో జరుగుతున్న 68వ రాష్ట్రస్థాయి అండర్-19 హాకీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం రెండోరోజు హోరాహోరీగా సాగాయి. పలు జిల్లాల మధ్య పోటీ ఉత్కంఠభరితంగా జరిగింది. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విజేతలను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పాఠశాలల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు.

రెండోరోజు సెమీఫైనల్స్‌లో విజేతలు

బాలికల విభాగంలో విశాఖపై అనంతపురం 3.1 తేడాతో విజయం సాధించింది. వైఎస్‌ఆర్ కడప జిల్లా జట్టుపై తూర్పుగోదావరి జట్టు 3.0తేడాతో గెలిచింది. సోమవారం ఫైనల్స్‌లో మొదటి మ్యాచ్‌లోతూర్పు, అనంతపురం తలపడనున్నాయి. విశాఖ, వైఎస్‌ఆర్ కడపజట్టు పోటీ పడనున్నాయి. బాలుర విభాగంలో సెమీఫైనల్స్‌లో కడపపై తూర్పుగోదావరిజట్టు 4.0 స్కోర్‌తో విజయం సాధించింది. అనంతపురంపై విశాఖ 7.2తేడాతో విజయం సాధించింది. సోమవారం ఫైనల్స్‌లో కడప, అనంతపురం జట్లు మొదటిమ్యాచ్‌లో విశాఖ, తూర్పుగోదావరి మూడోమ్యాచ్‌లో తలపడనున్నాయి.

అవును.. నిజంగా తాను అదృష్టవంతుడినే..

● శెట్టిబలిజ కార్తీక వన సమారాధనలో మంత్రి సుభాష్


సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కాకినాడ సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అవును.. నిజంగా తాను అదృష్టవంతుడినేనని, పార్టీ కోసం తానుచేసిన కృషిని, కష్టాన్ని గుర్తించి స్వర్ణాంధ్ర సృష్టికర్త చంద్రబాబు, డైనమిక్ నేత పవన్ కళ్యాణ్, యువ నాయకుడు నారాలోకేష్ తనకు టిక్కెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా, మంత్రిగా అవకాశం కల్పించారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో కాకినాడజిల్లా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సుభాష్ మా ట్లాడుతూ తాను రాజకీయాలకు కొత్త ఏమోగాని, సేవా కార్యక్రమాలకు కొత్త కాదన్నారు. శెట్టిబలిజ జాతి ఐక్యతకు, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. బీసీల సంక్షేమంకోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లు కేటాయించిందన్నారు. గీత కార్మికులను ఆదుకునేందుకు 10శాతం లిక్కర్ షాపులు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబులు మాట్లాడుతూ ఆర్థిక రాజకీయ పరిపుష్టి ఉంటేనే నేటి ఆధునిక యుగంలో రాణించగలమన్నారు. అనంతరం మంత్రి సుభాష్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు చొల్లంగి వేణుగోపాల్, వాసంశెట్టి రాజేశ్వరరావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వొమ్మి బాలాజీ, యనమదల రవి, పెంకే శ్రీనివాస బాబా, గుబ్బల తులసికుమార్, పెంకే సత్తిబాబు, పెద్దింశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తుల శ్రీనివాస్, మేడిశెట్టి చిన్ని, దొడ్డి వీరేంద్ర, కడలి ఈశ్వరి, కుడుపూడి వెంకటలక్ష్మి, రాయుడు దుర్గ, పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దొంగతనం నెపంతో కొడవలితో దాడి

● టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నం

ఎటపాక, నవంబరు17(ఆంధ్రజ్యోతి): తనపై తరచూ దొంగతనం నెపం వేస్తున్నాడని, ఆవేశంతో ములకల నాగరాజు అనే వ్యక్తి టీడీపీ సీనియర్ కార్యకర్తపై కొడవలితో దాడిచేసి, హత్యాయత్నంకు ప్రయత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండా ల కాలనీ చెందిన సాయిలు బాబు గ్రామంలో ని ఓ రైతు వద్ద భూమితోపాటు సాగునీటికి మోటారు, పైపు గొట్టాలను కౌలుకు తీసుకున్నా డు. ఈ ఏడాది మేనెలలో కౌలు ఒప్పందం పూర్తి కావడంతో కౌలు రైతుకు సాయిలు బాబు నీటి గొట్టాల్లో 13 గొట్టాలు తక్కువగా ఇచ్చాడు. ఈవిషయంపై సాయిలుబాబు ములకల నాగరాజుని తన గొట్టాలు ఏమైనా తీశావా అని అడుగుతున్నాడు. ఆదివారం మరోమారు అడగడంతో నాగరాజు తనపై దొంగతనం నెపం వేస్తున్నావంటూ కోపోద్రిక్తుడై తన ద్విచక్ర వాహనంలో ఉన్న కొడవలితో సాయిలు బాబుపై దాడి చేశాడు. దాంతో ఆయన చెంప భాగంలోని చెవి కింద తీవ్రగాయమైంది., వెంటనే సాయిలు బాబుని భద్రాచలంలోని ఓ వైద్యశాలకు తరలించారు. గాయంకు 15కుట్లు వేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు పిఠాపురం విద్యార్థుల ఎంపిక

పిఠాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తాటిపాకలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పిఠాపురం పట్టణంలోని లిటిల్ సోల్జర్స్‌స్కూలు పదోవ తరగతి విద్యార్థిని బి.నాగరుతిక 46 కిలోల విభాగంలో, బాష్యం స్కూలు 9వ తరగతి విద్యార్థి జేఆర్ అరుణ్ 70కిలోల విభాగంలో జరిగిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 19 నుంచి 21వరకూ మచిలీపట్నంలో జరిగే బాక్సింగ్‌పోటీల్లో పాల్గొంటారు.


బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అదుపుతప్పిన ద్విచక్రవాహనం

● విద్యుత్ దిమ్మను ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడక్రైం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ఎలక్ట్రిక్ పోల్ దిమ్మను ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పశ్చిమగోదావరిజిల్లా పోడూరుకు చెందిన బెల్లాని సుదర్శన్(40) వివాహితుడు. భార్యతో విడాకులు కావడంతో మూడేళ్లుగా కాకినాడ జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లోని తన అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం బయటకు వెళ్లొస్తానని ఇంటి వద్ద చెప్పి బైక్‌పై బయలుదేరాడు. ఎన్టీఆర్ వారధిపై నుంచి వార్ఫు రోడ్డువైపు తిరుగుతుండగా అదుపుతప్పి వంతెన ప్లాట్‌ఫాంపైన ఉన్న ఎలక్ట్రిక్ పోల్ దిమ్మను బలంగా ఢీకొట్టాడు. దీంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగదుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసుదర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన బెల్లాని సుదర్శన్

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మలికిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ఎందరికో ఆసరాగా ఉంటోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కొప్పినీడి రాధాకృష్ణ (శంకరగుప్తం), బత్తుల వినీత్ (వేగివారిపాలెం)లకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు.

విగ్రహ ప్రతిష్ఠ

మలికిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మలికిపురం అడబాలవారిమెరకలోని శ్రీకోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వైభవోపేతంగా జరిగింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, మాజీ ఎంపీపీ గంగాభవానీ, పిండి సత్యనారాయణ, అడబాల శేషారావు పాల్గొన్నారు.

'అంతర్వేది'కి పోటెత్తిన భక్తులు



అంతర్వేది ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు, కాట్రేనికోన: ప్రత్యేక అలంకరణలో కుండలేశ్వరస్వామి

అంతర్వేది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రానికి సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కార్తీకమాసం కావడంతో ఆదివారం సముద్ర, నదీ పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు తొలుత క్షేత్ర పాలకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం నందీశ్వరుని వద్ద కార్తీక దీపారాధన చేశారు. లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఆలయ సిబ్బంది తాగునీరు తదితర సేవలు అందించారు. నిత్యాభిషేకం, సుదర్శన హోమాల్లో భక్తులు పాల్గొని పూజలు చేశారు. రద్దీ కారణంగా నిత్యాన్నదానంలో బఫే విధానంలో ప్రసాదం అందించారు. సాయంత్రం వేళ సాగరసంగమ తీరాన బీచ్, లైట్‌హౌస్ వద్ద భక్తులు, పర్యాటకులు సందడి చేశారు.

కుండలేశ్వరంలో భక్త జనం

కాట్రేనికోన, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమి నదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాశ్యకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో 6000మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ళ భాను, అక్కల నాగమందేశ్వరరావు, నంద్యాల వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ భద్రరావు, మోటిపల్లి శ్రీను, సలాది సతీష్, చిక్కం ఆనందకుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ శంకర్, మీసాల బాలచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష బిల్వార్చన

అంబాజీపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీవ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంలో, ముక్కామల శ్రీరాఘవేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో నుంచి వంద మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో వచ్చి ఏకాదశ రుద్రులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం వివిధ ప్రాంతాలు తరలివచ్చిన భక్తులకు ఆయా ఆలయ కమిటీలు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. అలాగే ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఉమామల్లేశ్వరునికి లక్ష బిల్వార్చన

అల్లవరం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉమామల్లేశ్వరస్వామి ఆలయంలో వేదపండితుడు మంగళంపల్లి పాండురంగ విఠల్ ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన, అభిషేకాలు జరిగాయి. బండిగుప్తాపు నాగేశ్వరరావు, బండిగుప్తాపు సత్తిబాబు కర్తలుగా వ్యవహరించారు.సూర్యనమస్కారాలు, సుందరకాండపారాయణ,జ్యోతిలింగార్చన జరిగాయి. అనంతరం అన్నసమారాధన చేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

రాజోలు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పారిశుధ్యంపై సెక్రటరీలు, సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా శ్రీను అధ్యక్షతన ఆదివారం జరిగిన రాజోలు మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో విద్యుత్‌కు సంబంధించి పలు సమస్యలు ఉన్నాయని, సాధ్యమైనంత వరకు వాటిని పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాసరావుకు సూచించారు. తాగునీటి సమస్యను తీర్చడానికి రూ.135కోట్ల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించానని తెలిపారు. ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రూ.2కోట్లు మంజూరయ్యాయన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడిగిన పలు ప్రశ్నలకు వివిధశాఖల అధికారులు సమాధానాలు చెప్పారు. ఎంపీడీవో డి.రాంబాబు, తహసీల్దారు ప్రసాద్, జడ్పీటీసీ మట్టా శైలజ, వైస్ ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, యింటిపల్లి ఆనందరాజు, ఏవో ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

మత్తు ఇంజక్షన్ వికటించి మహిళ మృతి


ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా

రాజోలు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రాజోలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ నిమిత్తం ఇచ్చిన మత్తు ఇంజక్షన్ వికటించి మలికిపురం మండలం అడవిపాలేనికిచెందిన కందికట్ల మంగ(45) ఆదివారం మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మంగ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటోంది. 20రోజుల క్రితం స్వదేశానికి తిరిగి వచ్చింది. గర్భసంచికి పుండు పడడంతో శస్త్ర చికిత్స నిమిత్తం ఈనెల16న రాజోలులోనొ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. ఆదివారం ఉదయం ఆపరేషన్ చేసే ముందు మత్తు ఇంజక్షన్ ఇచ్చారని, అది వికటించి మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. మంగను అన్యాయంగా చంపేశారని ఆరోపించారు.

ఐకమత్యంతో అభివృద్ధిలో భాగస్వాములు కావాలి




అమలాపురం: మాట్లాడుతున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ దంపతులకు సత్కారం, రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులకు సన్మానం

- కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, మంత్రి సుభాష్
- పలు చోట్ల కార్తీక వనసమారాధనలు

అమలాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంగా ఉంటూ దేశ, రాష్ట్రాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. శ్రీకోనసీమ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్తీక వనసమారాధనకు శ్రీనివాసవర్మ, రఘురామకృష్ణంరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత వీరికి క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్సీలు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), రుద్రరాజు పద్మరాజు, సీనియర్ జర్నలిస్టు నడింపల్లి సీతారామరాజు, సమితి అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎన్ రాజు, పి.వెంకటపతిరాజు మాట్లాడారు. విద్యా ప్రదాత పెన్మత్స జగన్నాథరాజుతో పాటు ముఖ్యఅతిథులను క్షత్రియకార్పొరేషన్ సభ్యులు దెందుకూరి సత్యనారాయణరాజు (సత్తిబాబు రాజు), సయ్యపరాజు వెంకటసత్యనారాయణరాజు, చిలువూరి వెంకటసత్యనారాయణరాజు ఘనంగా సత్కరించారు. వేగిరాజు వెంకట్రాజు, దాట్ల బాబు, కోనసీమ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన క్షత్రియులు పాల్గొన్నారు.

అమలాపురం పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామపురం సుమలత ఐటీఐ ప్రాంగణంలో మట్ట రవికిశోర్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. మహిళలు, చిన్నారులకు పలు పోటీలు నిర్వహించారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. పట్టణ గౌడ సంఘం భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మంత్రి సుభాష్‌తో పాటు పలువురు ప్రముఖలను సత్కరించారు. గౌడ సంఘ ప్రముఖులు వీరిన సాయిరామ్, వెలిగట్ల రామలక్ష్మణరావు, వెలిగట్ల జగదీష్, దాసరి శ్రీనివాస్, అయినవిల్లి నాగేంద్రకుమార్, రాజులపూడి భీముడు, ఎస్.రాజరాజేశ్వరి, వంక శ్రీనివాస్, వెలిగట్ల సూరిబాబు, మట్ట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర ఆటోవాలా శ్రీదుర్గాహనుమాన్ సెంటర్ అమలాపురం శాఖ ఆధ్వర్యంలో బండారులంకలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఆటో కార్మికుల కుటుంబీకులు 1500 హాజరయ్యారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆటో యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో మంత్రి సుభాష్‌ను సత్కరించారు. ఆటో కార్మికుల సమస్యలను మంత్రికి వివరించారు. యూనియన్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వనసమారాధనకు హాజరైన మహిళలందరికీ రవిక, పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. వి.వెంకటేష్, బొక్కా నాని, బండారు శ్రీను, ముషిణి ఆనంద్, ఊటుకూరి ప్రకాష్, ఎం.శ్రీను, వి.చంద్రశేఖర్, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

ఉసిరి చెట్టు వద్ద పూజలు

పి.గన్నవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగుల్లంకలో శ్రీవిఘ్నేశ్వర శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత సంఘ సభ్యులు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కంకటాల ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు చెల్లిబోయిన శ్రీనివాసరావు, మరాటి గోవిందు, రాయుడు సూర్యనారాయణ, బొక్కా ఏడుకొండలు, గుడాల శ్రీనివాస్, పితాని ఏడుకొండలు, మోల్లేటి గోపాలకృష్ణ, కాకి శ్రీనివాస్, జోగి నారాయణమూర్తి పాల్గొన్నారు.

వనసమారాధనలతో ఐక్యత

అంబాజీపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు ఐక్యతకు దోహద పడతాయని మాజీ ఎమ్మెల్సీ ఐలాపురపు వెంకయ్య, కుమ్మర శాలివాహన సంఘ ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మండేపూడి పురుషోత్తం పేర్కొన్నారు. మాచవరంలో కోనసీమ కుమ్మరి శాలివాహన సంఘ కార్తీక వనసమారాధన సంఘ అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మణ్యం అధ్యక్షతన ఆదివారం జరిగింది. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి వెంకటసుబ్బారావు, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాలిపర్తి భీమేశ్వరరావు, ఆదుర్తినారాయణమూర్తి, మంతెన శ్రీనివాస్, మానేపల్లివీరబ్రహ్మణ్యం, పుల్లేలటికుర్తి రత్నం,దొడ్డిపట్ల శ్రీనివాస్, ర్యాలి శ్రీనివాస్‌వడయార్, వీరవాసరపు సుబ్బా రావు, చిరతపూడి హేమలత, పేరూరి విజయలక్ష్మి, మంతెన లక్ష్మి, రాయపూడి వెంకటేశ్వరరావు, ర్యాలి భాస్కరరావు, వెల్ల పాండురంగరావు పాల్గొన్నారు.

వనసమారాధనతో అందరూ ఒక్కటే

అమలాపురం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అందరూ ఒక్కటేనని, అన్నం పరబ్రహ్మ స్వరూపమని తెలిపేందుకు కార్తీక వనసమారాధనలు దోహదపడతాయని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో కోనసీమ శెట్టిబలిజ కార్తీక వనసమారాధన నిర్వహించారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పిల్లి సూర్యప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. చిన్నారుల కోలాట ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. సంఘ ప్రముఖులు యిళ్ల శేషగిరిరావు, పెచ్చెట్టి విజయలక్ష్మి, మట్టపర్తి మీరాసాహెబ్‌శెట్టి, సంసాని బులినాని, చెల్లుబోయిన శ్రీనివాసరావు, గొవ్వాల రాజేష్, బొంతు గోవిందుశెట్టి, కుడుపూడి భరత్‌భూషణ్, చెల్లుబోయిన నాని, దంగేటి రుద్ర పాల్గొన్నారు.

సమైక్యంగా ముందుకు సాగాలి

మలికిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లక్కవరంలో ఆదివారం శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘీయులు సమైక్యంగా ఉండి ముందుకు వెళ్లాలన్నారు. యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మద్యం తరలింపులో నలుగురి అరెస్టు

ముమ్మిడివరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఈఏఎస్ అమర్‌బాబు ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు శని, ఆదివారం రెండు బెల్టుషాపులపై దాడిచేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 30మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ముమ్మిడివరానికి చెందిన విత్తనాల శ్రీనివాసరావు, ఐ.పోలవరం మండలం జి.వేమవరానికి చెందిన దాసరి సత్యనారాయణలను అరెస్టు చేశామన్నారు. శ్రీనివాసరావు వద్ద నుంచి 10మద్యం సీసాలు, సత్యనారాయణ నుంచి 20మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. మోటారు సైకిల్‌పై యానాం నుంచి 45ఎన్‌డీపీ మద్యం సీసాలను తరలిస్తున్న తాళ్లరేవు మండలం కొత్తలంకకు చెందిన పాముల మణిబాబును అరెస్టు చేసి, మద్యం సీసాలు, మోటారుసైకిల్‌ను సీజ్ చేశామన్నారు. నిడదవోలుకు చెందిన షేక్ రహీమ్ నుంచి 4మద్యం సీసాలు తరలిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకుని సీజ్ చేశామన్నారు. నలుగురు నిందితులపై కేసు నమోదుచేసి అరెస్టుచేసినట్టు సీఐ తెలిపారు. 49మద్యం సీసాలను, 30బెల్టుషాపుల మద్యం సీసాలను సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి


సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

ముమ్మిడివరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల26న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఆదివారం ముమ్మిడివరంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సీఐటీయూ, కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, దళిత, బలహీనవర్గాల ప్రజలపై ఆర్థికభారం మోపుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. దేశ సంపదను అంబానీ, ఆదానీలకు దోచి పెడుతున్నారన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ మార్కెట్ ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డును ఊరికి దూరంగా మార్పు చేయాలని, లేనిపక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేపడతామని హెచ్చరించారు. పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, నిమ్మకాయల వెంకటేష్, యలమంచిలి బాలరాజు, ఏవీ రమణమ్మ, ఉమాదేవి, అరుణకుమారి, కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలను అణచివేయాలని కుట్ర

అయినవిల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలను అణచి వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని రాక్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టి వర్గీకరణను అడ్డుకుని తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. జాతీయ ఉపాధ్యక్షుడు కొంకి వెంకట్రావు ఆధ్వర్యంలో తొత్తరమూడి నామాడివారిపేటలో జరిగిన సమావేశంలో రత్నాకర్ మాట్లాడారు. రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కీర్తినాయుడు, వారా లక్ష్మీనరసింహరామ్, కాశి వీరవెంకటసత్యనారాయణ, గుర్రాల రాంబాబు, బొక్కా రామచంద్రరావు, మద్దా చంటిబాబు, జిత్తుక రాంబాబు పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో కవిత్వం సాగాలి

అమలాపురం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కవులు సామాజిక స్పృహతో కవిత్వం సాగించాలని కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని రుగ్మతలకు కవులు పరిష్కార మార్గాలు చూపుతూ కవిత్వం సాగించాలన్నారు. గ్రంథాలయ అధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. కవులు నల్లా నరసింహమూర్తి, మాకే బాలార్జున సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, బీవీవీ, టి.వెంకటేశ్వరరావు, ముత్యాల శ్రీశరత్‌బాబు, రాయుడు త్రినాథరావులను సత్కరించారు.

సాగరతీరంలో కార్తీక సందడి

అల్లవరం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు తీరంలో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. సముద్ర స్నానాలు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇసుక తిన్నెలపై వనభోజనాలు చేశారు. సరుగుడు తోటలు నరికేయడంతో సందర్శకులు ఇబ్బందిపడ్డారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

అమలాపురంటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ1998లోమినిమం టైమ్‌స్కేలు (ఎంటీఎస్) ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులర్ చేయాలని, వయో పరిమితిని 60నుంచి 62ఏళ్లకు పెంచాలని కోరుతూ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆదివారం అమరావతి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినట్టు ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు సీహెచ్ కేశవకుమార్ తెలిపారు. బకాయిపడ్డ 12నెలల వేతనాలు చెల్లించి ఉద్యోగవిరమణ తర్వాత కనీస పెన్షన్ సదుపాయం కల్పించాలని వేడుకున్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలను విద్యా శాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు వై.సుబ్బారాయుడు, ఉపాధ్యాయులు వజ్రకుమార్, నాగరాజు, రామిరెడ్డి, కృష్ణంరాజు, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడుకి నివాళి

అమలాపురం టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు సంతాప సభను ఆదివారం డాక్టర్ మెట్ల స్వగృహం వద్ద నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. అమలాపురం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నల్లా స్వామి, బొర్రా ఈశ్వరరావు, మల్లుల పోలయ్య, తిక్కిరెడ్డి నేతాజీ,భాస్కర్ల రామకృష్ణ, మంద గెద్దయ్య, చింతలపూడి సత్తిబాబు, పెద్దిరెడ్డి సాయిపుల్లయ్యనాయుడు, అబ్బిరెడ్డి చంటి, బత్తుల సాయి, వలవల శివరావు, అనుపోజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

10న విజయవాడలో విశ్వజన కళామండలి సభ

అమలాపురం టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విశ్వజన కళామండలి 46వ వార్షికోత్సవ సభను విజయవాడలో డిసెంబరు 10న నిర్వహించనున్నట్టు సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మాష్టర్జీ ప్రకటించారు. విశ్వజన కళామండలి అత్యవసర సమావేశాన్ని ఆదివారం మైనీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మాష్టర్జీ అధ్యక్షతన నిర్వహించారు. వార్షికోత్సవ సభను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు యడ్ల సురేష్‌కుమార్, సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు మేకల మీరాసాహెబ్, జిల్లా శాఖ అధ్యక్షుడు గెద్దం శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలు పల్లేటి సుశీల అనేక అంశాలపై మాట్లాడారు. పరిస్థితులను బట్టి డిసెంబరు 10వ తేదీన వాయిదాపడితే వారంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో వైవీ సత్యనారాయణ, బర్రే కొండబాబులతో పాటు పలువురు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శిక్షణ

అమలాపురం టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వివేకానంద సేవా సమితి, నేదునూరు వివేకానంద యువత, అఖిల భారత విద్యార్థి పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షుడు గొవ్వాల నాగరాజు అధ్యక్షతన అమలాపురం సర్ సీవీ రామన్ పబ్లిక్ స్కూలులో జరిగిన శిక్షణకు ప్రముఖ వ్యాపారవేత్త పి.రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ముషిణి రామకృష్ణారావు, ఆకుల రవితేజ, ఆకొండి పవన్, ఎం.శేఖర్, డాక్టర్ కొప్పినీడి వెంకటరమణ విద్యార్థులకువ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇవ్వగా అంజనీశ్రీనివాస్, రవణం వేణు, పేరి లక్ష్మీనరసింహం, పెద్దాపురం సీఐ అంకబాబు, ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధా కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు మరో అవకాశం

ముమ్మిడివరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) విధానం ద్వారా నిర్వహిస్తున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి తత్కాల్ చెల్లింపు విధానంలో ఫీజు చెల్లించడానికి ఈనెల 24వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీంబాషా తెలిపారు. ఫీజు చెల్లించే సమయం ముగిసినప్పటికి తత్కాల్ ఫీజు చెల్లింపు విధానం ద్వారా ఈనెల17నుంచి 24వరకు అవకాశం ఉందన్నారు. ఇంతవరకు ప్రవేశం పొందని వారు దగ్గరలోని స్టడీసెంటర్ కో-ఆర్డినేటర్‌ను సంప్రదించాలని డీఈవో తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

మామిడికుదురు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి పడిపూజ మగటపల్లిలో శనివారం రాత్రి ఘనంగా జరిగింది. అయ్యప్పస్వాములు పలు గ్రామాల్లోని శివాలయాలను సందర్శించి శివుడికి పూజలు నిర్వహించారు. ఇరుముడి ధరించి శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. పాశర్లపూడిలోని శ్రీఉమాచెన్నమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద 20మంది, పెదపట్నంలంకలోని శ్రీఉమాసత్యలింగేశ్వరస్వామి ఆలయం వద్ద 14మంది, మొగలికుదురు శివాలయం వద్ద 15మంది స్వాములు ఇరుముడులు ధరించి అయ్యప్పకొండకు బయలుదేరి వెళ్లారు. గురుస్వాములు జయంతి సుబ్బారావు, కొర్లపాటి రామారావు, వర్ధినేని బుజ్జి స్వాములను ఇరుముడులు కట్టి కొండకు సాగనంపారు.

కవి సమ్మేళనం

కాట్రేనికోన, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కవులు నిరంతరం సామాజిక చైతన్యం దిశగా కవిత్వం రాయాలని సీనియర్ తెలుగు ఉపన్యాసకుడు, కవి నల్లా నరసింహమూర్తి సూచించారు. ఆదివారం కందికుప్ప గ్రంథాలయంలో కవిసమ్మేళనం జరిగింది. కవి సమ్మేళనం సందర్భంగా శ్రీశ్రీ, గుర్రం జాషువా, బోయి భీమన్న, సినారే చిత్రపటాలకు కవులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కవి సమ్మేళనంలో శ్రీపాద రామకృష్ణ, నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు. విశ్రాంత పీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అద్దంకి అమరేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీహరిరావు, జి.వెంకటేశ్వరరావు, గాంధీ, వై.రామచంద్రరావు, కె.కృష్ణమూర్తి, పి.సత్య పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

అమలాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇందుపల్లి అరవ గరువులో శ్రీబాలభక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శివపార్వతుల దివ్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి-అమ్మవార్లను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం జరిపారు. కార్తీకమాస రుద్రాభిషేక పూర్వక శ్రీఉమాసోమేశ్వర కల్యాణ సహిత అనంత దీపోత్సవం నిర్వహించారు. వారణాశి నాగవెంకటసేతుమాధవలక్ష్మీనరసింహమూర్తి ఆచార్య బ్రహ్మత్వంలో శివపార్వతుల కల్యాణాన్ని వందలాది మంది భక్తుల సమక్షంలో జరిపించారు. కల్యాణ మండపాన్ని విస్సుశర్మ ఆధ్వర్యంలో అలంకరించారు.

రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలకు నవోదయ విద్యార్థి ఎంపిక

యానాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంరక్షణపై అవగాహన, ప్రచారంలో భాగంగా భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గత నెల ప్రాంతీయ స్థాయి ఆన్‌లైన్‌లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో యానాం నవోదయ విద్యాలయం విద్యార్థిని ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకుఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.రాజశేఖరరెడ్డి తెలిపారు. ఈనెల26న పుదుచ్చేరిలో జరగబోయే రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలకు ఎంపికైన రితికను, ఆర్ట్ టీచర్‌ను ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయబృందం, సిబ్బంది అభినందించారు.

వేప-రావిచెట్లకు కల్యాణం



అంతర్వేది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెంలో కూన శ్రీరామమూర్తి-మహాలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో మారెమ్మ ఆలయం వద్ద వేప-రావిచెట్లకు కల్యాణం నిర్వహించారు. వేదపండితుల సమక్షంలో జరిగిన కల్యాణ తంతును స్థానిక పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు.

యెరుబండి ఆత్మీయ సమ్మేళన సందడి

మామిడికుదురు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడులంకలో ఆదివారం జరిగిన యెరుబండి ఆత్మీయ సమ్మేళనానికి మామిడికుదురు మండలం నుంచి అధికసంఖ్యలో యెరుబండివారు వెళ్లారు. ఈదరాడ గ్రామం నుంచి అధిక సంఖ్యలో యెరుబండి వారు 300మంది కుటుంబ సభ్యులు ఆనందోత్సాహాల మధ్య సమ్మేళనానికి వాహనాలు, బైకులపై నినాదాలు చేస్తూ తరలివెళ్లారు.

కొత్త తూరలు ఏర్పాటు

మామిడికుదురు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు బుల్లోడు వంతెన సమీపంలో ఈర్ల చెరువుకు ప్రధాన పంటకాల్వ నుంచి బోదెకు వెళ్లే తూర శిథిలమవ్వడంతో రైతులు పంచాయతీలో ఫిర్యాదు చేశారు. పంచాయతీ తూరలను సమకూర్చడంతో ఆదివారం సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ ఆర్‌అండ్‌బీ రోడ్డును తవ్వించి కొత్త తూరలను ఏర్పాటు చేశారు. ప్రధాన పంట బోదె చెత్తా చెదారంతో మూసుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని రైతులు సర్పంచ్‌కు వివరించారు. త్వరలో పంట బోదెను కూడా ఆధునికీకరించి రైతులు ఇబ్బందులు గట్టెక్కిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. నయినాల గాలివాహనమూర్తి, కంచి శివరావు, కాంట్రేగుల సాయిరామ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో తెలంగాణ డీఐజీ పూజలు

అంతర్వేది, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తెలంగాణ డీఐజీ గజరావ్ భోపాల్ ఆదివారం విచ్చేశారు. ఆయనకు అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికి అంతరాలయంలో స్వామి దర్శనం చేయించారు. వేదపండితులు మహదాశీర్వచనం ఇచ్చారు. డీఐజీకి స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ అందించారు.

ఒత్తిడిలేని జీవితమే ఆరోగ్యదాయకం

అమలాపురం టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఒత్తిడి లేని జీవితమే ఆరోగ్య దాయకమని రాజయోగిని బీకే రమాదేవి పేర్కొన్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం వరకు ఒత్తిడి అనేది కేవలం ఒక సైన్స్ పదంగా మాత్రమే ఉండేదన్నారు. కాలానుగుణంగా వచ్చినమార్పులతో మనోభావనగా మానసిక స్థితిని తెలియచేసేదిగా మారిందని వివరించారు. అమలాపురం బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యావిద్యాలయంలోని హార్మనీ హౌస్‌లో ఆదివారం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి ఆధ్వర్యంలో ఒత్తిడిని జయించే యోగాభ్యాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కార్తీక మాస వనభోజనాలు నిర్వహించారు. బీకే స్వరూపతో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు కవిత్వంపై అవగాహన పెంచుకోవాలి

ఉప్పలగుప్తం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మానసిక వికాసానికి విద్యార్థులు కవిత్వంపట్ల అవగాహన పెంచుకోవాలని శ్రీశ్రీకళా వేదిక జిల్లా అధ్యక్షుడు, ఏవీఎస్ఎన్ కళాశాల ఆంధ్రోపన్యాసకుడు నల్లా నరసింహమూర్తి పేర్కొన్నారు. ఆదివారం భీమనపల్లి గ్రంథాలయంలో శ్రీశ్రీ కళా వేదిక, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి సమ్మేళన సభ జరిగింది. కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, కవి నల్లా నరసింహమూర్తిని గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషుకుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, అద్దంకి అమరేశ్వరరావు, కడలి సత్యనారాయణ, రాయుడు త్రినాథరావు కవితా గానం చేశారు.

మత్స్యకారులకు ఆటల పోటీలు

యానాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో మత్స్యకారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈపోటీలను యానాం మత్స్యశాఖ ఏడీ దడాల గోంతయ్య, ఇతర అధికారులు పర్యవేక్షించారు. ప్రతిభ సాధించిన మత్స్యకారులకు త్వరలో నిర్వహించే సభలో బహుమతులు అందజేస్తారు.

ఎమ్మెల్యేకు రజక సంఘం సన్మానం

ఐ.పోలవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా చినకొత్తలంకకు చెందిన గొల్లపల్లి ధర్మారావు నియామకానికి సహకరించిన ఎమ్మెల్యేకు రజక సంఘం కృతజ్ఞతలు తెలిపింది. దేవాలయాల పాలకవర్గాల నియామకంలో కూడా రజకులకు చైర్మన్లగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గుత్తుల బుజ్జి, పితాని రామచంద్రరావు, వనచర్ల వెంకట్రావు, కంతేటి నరేంద్రరాజు, పచ్చమట్ల రఘురాజు, కేశనకుర్తి సురేష్, నాగుడుపల్లి శ్రీనివాసరావు, రజకసంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వాల నమోదు

అల్లవరం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వాల నమోదు మండలంలో ముమ్మరంగా జరుగుతోందని బీసీసంఘ నాయకుడు గెద్దాడ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన, ఈతకోట రాజు యెంట్రుకోనలో సభ్యత్వాలు నమోదు చేయించారు.

రామ్మూర్తినాయుడుకి నివాళి

అంబాజీపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతికి టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక వెంకట్రాజు ఆయిల్‌మిల్లు వద్ద రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శెట్టి బలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొంతు పెదబాబు, రాష్ట్ర సహకార యూనిన్ మాజీ డైరెక్టర్ గణపతి వీరరాఘవులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మలికిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ఎందరికో ఆసరాగా ఉంటోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కొప్పినీడి రాధాకృష్ణ (శంకరగుప్తం), బత్తుల వినీత్ (వేగివారిపాలెం)లకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను అందించారు.

విగ్రహ ప్రతిష్ఠ

మలికిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మలికిపురం అడబాలవారిమెరకలోని శ్రీకోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వైభవోపేతంగా జరిగింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, మాజీ ఎంపీపీ గంగాభవానీ, పిండి సత్యనారాయణ, అడబాల శేషారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆత్మీయ కలయిక


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆలమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): యేరుబండి వారి ఆత్మీయ కలయిక కార్యక్రమం బడుగువానిలంకలో గోదావరి చెంతన ఆదివారం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన యేరుబండి కుటుంబీకులు ప్రత్యేక వాహనాల్లో ఆత్మీయ కలయికకు తరలివచ్చారు. యేరుబండి కుటుంబీకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. యేరుబండి ధర్మరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ కలయికకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని ప్రసంగించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఒకే కుటుంబీకులు ఇలా ఒకచోట కలుసుకోవడం వల్ల శుభపరినామమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన యేరుబండి కుటుంబీకులు ప్రసంగించారు.

వేంకన్న ఆదాయం రూ.5.55లక్షలు


ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక ఆదివారం భక్తజనం పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. గోవిందనామస్మరణతో ఆలయం మారుమ్రోగింది. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,55,322 లభించినట్టు ఉపకమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వార్డు సభ్యులు


టీడీపీలో చేరిన తాతపూడి వార్డు మెంబర్లను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ

కపిలేశ్వరపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తాతపూడి గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వైసీపీ 6వ వార్డు మెంబరు జుత్తుగ సరిత, 9వ వార్డు మెంబరు యడ్ల నాగేశ్వరరావు ఆదివారం టీడీపీ నాయకుడు మేకా శ్రీధర్ ఆధ్వర్యంలో మండపేట టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే వేగుళ్ళ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పువ్వల చిట్టిబాబు, టీడీపీ సీనియర్ నాయకులు వల్లూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ దుర్గమ్మకు వెండి కిరీటం బహూకరణ



కె.గంగవరం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బెజవాడ శ్రీకనక దుర్గా అమ్మవారికి ఆదివారం కోట గ్రామానికి చెందిన కొమ్ముల స్వామినాయుడు దంపతులు వెండి కిరీటాన్ని బహూకరిం చారు. ఈసందర్భంగా స్వామి నాయుడు మాట్లాడుతూ 1.3కిలోల వెండితో తయారు చేయించిన కిరీటాన్ని అమ్మవారి ఆలయానికి అందజేశామన్నారు. స్వామి నాయుడు ఆలమూరు మండలం కలవచర్ల రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్నారు.

← విజయవాడ కనకదుర్గా అమ్మవారికి వెండి కిరీటం బహూకరిస్తున్న దాత.

మండపేటలో న్యాయస్థానం ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే వేగుళ్లకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మండపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండపేటలో జూనియర్ సివిల్ కోర్టును ఏర్పాటు చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటిపల్లి సాయిరాం, బీజేపీ నేతలు కోనా సత్యనారాయణ, రామచంద్రరావు కోరారు. ఆదివారం వారు ఎమ్మెల్యే జోగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. మండపేటలో కోర్టు ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో కలపాలని అసెంబ్లీలో శని వారం కోరిన ఎమ్మెల్యేను వారు అభినందించారు.

బీజేపీ క్రియాశీలక సభ్యులుగా చేరండి

కొత్తపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్‌లు వారీగా వంద సభ్యత్వాలు పైబడి చేసిన వారందరూ పార్టీ క్రియాశీలక సభ్యులుగా చేరాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం తెలిపారు. ఆదివారం కొత్తపేటలో ఆయన స్వగృహం వద్ద బీజేపీ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సత్యానందం మాట్లాడుతూ దేశంలో అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అన్నారు. కార్యక్రమంలో పాలూరి జయప్రకాశ్ నారాయణ, సబ్బవరపు సత్యనారాయ ణ, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, భమిడిపాటి లక్ష్మినారాయణ, పొనుగుపాటి శ్రీనివాస్, బళ్ళ రాజు, వీరంకి సుందరం, గ్రంధి నవీన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

మండపేట,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండపేట శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్ఆర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 20మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల20న జరిగే ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. గ్రంథాలయ అధికారి పూర్ణమ్మ తెలిపారు.

దేశభక్తి గేయాలు

ఆత్రేయపురం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు దేశభక్తిగేయాలు, వేమన పద్యాలు పోటీలు నిర్వహించారు.

సమాజ సేవలో ముందుండాలి




తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వరరావును, టీటీడీ పాలకమండలి సభ్యుడు కోటేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యాలు, కపిలేశ్వరపురం: ఎమ్మెల్యే వేగుళ్లను సన్మానిస్తున్న దృశ్యం

తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీటీడీ సభ్యుడు అక్కిన మునికోటేశ్వరరావు

ఆత్రేయపురం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కమ్మ సంఘీయులు తమ సంఘ అభివృద్ధితో పాటు సమాజసేవలో ముందుండాలని తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీటీడీ పాలకమండలి సభ్యుడు అక్కిన మునికోటేశ్వరరావు పేర్కొన్నారు. కార్తీక ఆదివారం కొత్తపేట నియోజకవర్గ కాకతీయ కమ్మ సంఘ కార్తీక వనసమారాధన కార్యక్రమం వద్దిపర్రులో నిర్వహించారు. స్థానిక సర్పంచ్ జుజ్జవరపు శ్యామలహరిబాబు సమారాధనకు హాజరైన సంఘీయులను వేదికపైకి ఆహ్వానించారు. ప్రతి ఏటా కమ్మ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహిస్తున్నారు. ఆత్రేయపురం మండలం వద్దిపర్రులో లక్ష్మిగణపతి కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనసమారాధన నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల కమ్మ పెద్దలు పాల్గొన్నారు. తమ సంఘ అభివృద్ధితో పాటుసమాజ సేవలో ముందుండి తమ ఐక్యతను చాటుకోవాలన్నారు. తొలుతగా జ్యోతిప్రజ్వలన నిర్వహించారు. ఉన్నత పదవులు పొందిన వారిని ఘనంగా సత్కరించారు. గన్ని కృష్ణ, దొడ్డపనేని త్రినాధ్, తాళ్లూరి శ్రీనివాస్, ఈదల సత్తిబాబు, గోవిందరాజులు, ముళ్లపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహరావు తదితరులు తమ సందేశాలను అందించారు. అనంతరం ఉసిరిచెట్టు వద్ద పూజలు నిర్వహించి కార్తీక వనసమారాధనకు శ్రీకారం చుట్టారు. సహపంక్తి భోజనాలు నిర్వహించి ఉల్లాసంగా గడిపారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.

ఐకమత్యానికి ప్రతీకలు

కపిలేశ్వరపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐకమత్యానికి ప్రతీకలుగా కార్తీక వనసమారాధనలు నిలుస్తాయని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. ఆదివారం కపిలేశ్వరపురం గ్రామశెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్తీక వనసమారాధనలో వారు ముఖ్యఅతిధులుగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ళ, ఎమ్మెల్సీ తోట, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ లీలాకృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులను, సంఘ నాయకులను శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. తొలుత సంఘ పెద్దలు కుటుంబ సమేతంగా ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, మండపేట మున్సిపల్ మాజీ ఛైర్మెన్ చుండ్రు వరప్రకాష్, ఎంపీటీసీలు గొల్లపల్లి సోనియా, శీలం భాస్కరావు, రాష్ట్రశెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, శెట్టిబలిజ సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన కార్పొరేషన్ డైరెక్టర్లు



ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ జయబాబు, వేగుళ్లను కలిసిన మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్(దొరబాబు)

మండపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లుగా నియమితులైన గుడాల జయబాబు, మందపల్లి చంద్రశేఖర్‌లు(దొరబాబు)లు అనుచరులతో వచ్చి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వారు ఎమ్మెల్యేను సత్కరించారు. పదవులు ఇచ్చినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలోమున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మల్లిపూడి గణేష్, టీడీపీ మండపేట, కపిలేశ్వరపురం మండలాల అధ్యక్షులు యరగతపు బాబ్జి, ముత్యాల వెంకట్రావు, దూళి జయరాజు, బుంగ సంజయ్, కోడి చినఅప్పారావు, మందపల్లి శ్రీను, గోసాల ప్రసాద్, చుండ్రు రామకృష్ణచౌదరి, జుత్తుగ మల్లికార్జునుడు, పిల్లా తాతీలు, పుత్సల శ్రీను, కాదా వెంకటరమణ పాల్గొన్నారు.

20న ముగింపు సభ

కపిలేశ్వరపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి డి.శివకుమారి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల20న గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభలో బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని గ్రంథాలయాధికారిణి శివకుమారి తెలిపారు.

ద్రాక్షారామలో స్వామివారికి అభిషేకాలు యథాతథం

ద్రాక్షారామ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేకాలు జరగడం లేదంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, అలాంటి వదంతులు నమ్మవద్దని దేవస్థానం ఈవో అల్లు వెంకట దుర్గాభవాని భక్తులకు సూచించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. స్వామివారికి ద్రవ్యాలతో అభిషేకాలు చేయవద్దని, కేవలం జలంతో మాత్రమే స్వామివారికి అభిషేకాలు నిర్వహించాలని కేంద్ర పురావస్తు శాఖ ఇచ్చిన ఆదేశాలతో నిత్యం స్వామివారికి జలాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు తీసుకువచ్చిన సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసుకునేందుకు వీలుగా ఉత్తర వాయు లింగం వద్ద ఏర్పాట్లు చేశామని తెలిపారు.

చిత్రలేఖనం పోటీలు

ద్రాక్షారామ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించామని గ్రంథాలయాధికారి సూరిబాబు తెలిపారు. పర్యావరణం గురించి హిందీ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు వివరించారు. విజేతలకు ఈనె20న జరిగే ముగింపు సభలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.


కొత్తపేటలో జరిగిన శెట్టిబలిజ వనసమారాధనలో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్


రాయవరం మండలం వెదురుపాక వనసమారాధనలో ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న దృశ్యం


మండపేటలో శెట్టిబలిజ కార్తీక వనసమారాధనలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న సంఘీయులు

ఐకమత్యంతో అభివృద్ధి సాధ్యం

వనసమారాధనలో మంత్రి సుభాష్, రెడ్డి సుబ్రహ్మణ్యం

కొత్తపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఐక్యమత్యంతో అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ఆర్ఎస్ బీసీ కల్యాణ మండపం ఆవరణలో శెట్టిబలిజ కార్తీక వనసమారాధన జరిపారు. ముందుగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, రెడ్డి అనంతకుమారి దంపతులు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ శెట్టిబలిజులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కొత్తపేట మాదిరిగానే అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం మండలాల్లో బీసీ కల్యాణ మండపాలు నిర్మిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కముజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెదురుపాకలో కార్తీక వనసమారాధన

రాయవరం: మండలంలోని వెదురుపాక గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ నల్లమిల్లి శివశంకరరెడ్డి ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిపారు. గ్రామ శివారు పాపమ్మ పొలం వద్ద జరిగిన కార్యక్రమంలో తొలుత ఉసిరిచెట్టు వద్ద లక్ష్మీనారాయణ, పార్వతి పరమేశ్వరులకు పూజలు చేశారు. కార్తీక వనసమారాధనలో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మంతెన సత్యశ్రీనివాసరాజు, కొప్పూరి చిన్న సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం కాశీరాజు తోటలో సత్తివారి కార్తీక వనసమారాధనను కమిటీ సభ్యులు ఎస్.వెంకట సత్యనారాయణరెడ్డి, ఎస్.సూర్యభాస్కరరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో వనసమారాధన జరిపారు. పోతంశెట్టి రామిరెడ్డి పార్క్ వద్ద వాకింగ్, వ్యాయామం చేసే వారంతా క్రీడా ప్రాంగణంలో ఉన్న ఉసిరిచెట్టు వద్ద పూజలు చేసి వనసమారాధన జరిపారు.


రావులపాలెం జరిగిన కార్తీక వనసమారాధనలో చిన్నారుల నృత్య ప్రదర్శన

మండపేట: పట్టణ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో కార్తీక వనసమారాధన జరిపారు. సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముందుగా ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ పట్టణ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాసరావు, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.


మూలస్థానంలో మూలేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారు

మూలేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం


ఆలమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంలో నున్న మూలేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్తీకమాసం సందర్భంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కల్యాణోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ అర్చకస్వాముల అధ్వర్యంలో లక్షపత్రి పూజ, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మిక శాఖ మంత్రి సుభాష్

రామ్మూర్తినాయుడు మృతి టీడీపీకి తీరనిలోటు

కార్మిక శాఖ మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు మృతి టీడీపీకి తీరని లోటని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో ఆదివారం రామ్మూర్తినాయుడు సంతాప సభను కూటమిని నాయకులు నిర్వహించారు. దీనికి మంత్రి హాజరై రామ్మూర్తినాయుడు చిత్రపటానికి కూటమి నాయకులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


అన్నాభిషేకం నిర్వహించిన దృశ్యం

అయ్యప్పస్వామికి అన్నాభిషేకం

ఆలమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోనున్న అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామికి అన్నాభిషేకం జరిపారు. ఆలయం వద్ద గల పీఠం నిర్వహిస్తున్న అయ్యప్పభక్తులు సతీష్‌స్వామి, సుధాకర్‌స్వామి, బూరయ్యస్వామిల అధ్వర్యంలో సప్త నదీ జలాలతో స్వామివారికి అన్నాభిషేకాన్ని ఆలయ అర్చకస్వాములు అంగర వేణుగోపాలాచార్యులు, సింగరాచార్యులు జరిపారు. అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు దర్శించుకున్నారు.

విక్రమభట్టీశ్వరస్వామికి పల్లకీ బహూకరణ


ఆలమూరు విక్రమభట్టీశ్వరస్వామి ఆలయానికి పల్లకీని బహూకరిస్తున్న దాతలు

ఆలమూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శతాబ్దాల చరిత్ర గల ఆలమూరు పార్వతీ సమేత విక్రమభట్టీశ్వరస్వామి ఆలయానికి స్వామివార్ల గ్రామోత్సవానికి ఉపయోగించే పల్లకీని బహూకరించారు. గ్రామానికి చెందిన గెద్దం దుర్గయ్యశాస్త్రి కుటుంబీకుల అధ్వర్యంలో తయారు చేయించిన పల్లకీని వేదపండితులు సంప్రోక్షణ చేసి ఆలయానికి అందజేశారు. దుర్గయ్యశాస్త్రి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

'అంతర్వేది'కి పోటెత్తిన భక్తులు

అంతర్వేది, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రానికి సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కార్తీకమాసం కావడంతో ఆదివారం సముద్ర, నదీ పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు తొలుత క్షేత్ర పాలకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం నందీశ్వరుని వద్ద కార్తీక దీపారాధన చేశారు. లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తులు కిటకిటలాడారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఆలయ సిబ్బంది తాగునీరు తదితర సేవలు అందించారు. నిత్యాభిషేకం, సుదర్శన హోమాల్లో భక్తులు పాల్గొని పూజలు చేశారు. రద్దీ కారణంగా నిత్యాన్నదానంలో బఫే విధానంలో ప్రసాదం అందించారు. సాయంత్రం వేళ సాగరసంగమ తీరాన బీచ్, లైట్ హౌస్ వద్ద భక్తులు, పర్యాటకులు సందడి చేశారు.

సామాజిక స్పృహతో కవిత్వం సాగాలి

అమలాపురం టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కవులు సామాజిక స్పృహతో కవిత్వం సాగించాలని కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని రుగ్మతలకు కవులు పరిష్కార మార్గాలు చూపుతూ కవిత్వం సాగించాలన్నారు. గ్రంథాలయ అధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. కవులు నల్లా నరసింహమూర్తి, మాకే బాలార్జున సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, బీవీవీ, టి.వెంకటేశ్వరరావు, ముత్యాల శ్రీశరత్‌బాబు, రాయుడు త్రినాథరావులను సత్కరించారు.

సమైక్యంగా ముందుకు సాగాలి

మలికిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లక్కవరంలో ఆదివారం శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వనసమారాధనకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ హాజరయ్యారు. సంఘీయులు సమైక్యంగా ఉండి ముందుకు వెళ్లాలన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం


బాధితుడికి ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

రావులపాలెం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన సానబోయిన సాయి దుబాయ్‌లో అనారోగ్యానికి గురయ్యాడు. ఇటీవల స్వగ్రామానికి చేరుకోగా బాధితుడికి వైద్య ఖర్చులు భారంగా మారాయి. దీంతో ఈతకోటకు చెందిన జడ్పీ పాఠశాల పీఈటీ టేకి రామకృష్ణ, మనం ట్రస్టు రావులపాలెం మండల ఇన్‌చార్జ్ గంధ్రోతు దుర్గాదేవి ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.41వేలను బాధితుడికి అందించారు.